సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 17 । జూన్ । 2025



పాఠశాల మూసివేతపై ఆందోళన పర్వం 8లో



యోగా వేడుకలకు ట్రాఫిక్ ఆంక్షలు 8లో



వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ కమిటీల నియామకం 8లో

న్యూస్‌రీల్

పోర్ట్‌కు రెండు ప్రతిష్ఠాత్మక సీఎస్ఆర్ అవార్డులు



అవార్డులు రావడంపై సంతోషం వ్యక్తం చేస్తున్న వీపీఏ చైర్‌పర్సన్ అంగముత్తు

విశాఖ సిటీ: విశాఖ పోర్ట్ అథారిటీ(వీపీఏ)కు రెండు ప్రతిష్ఠాత్మక సీఎస్ఆర్ అవార్డులు లభించాయి. ఢిల్లీలో జరిగిన 11వ వార్షిక గ్రీన్‌టెక్ సీఎస్ఆర్ అవార్డ్స్–2025లో ఈ అవార్డులను అందజేశారు. హెల్త్ కేర్ ప్రమోషన్, నైపుణ్యాభివృద్ధి విభాగాల్లో వీపీఏ చేసిన కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డులు దక్కాయి. ఈ అవార్డులు లభించడం పట్ల పోర్టు చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయానికి కారకులైన ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. సామాజిక పరంగా సమగ్రాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.3.21 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం 33 రోజులకు గాను రూ.3,21,38,717 వచ్చినట్టు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. సింహగిరిపై ఉన్న యాత్రికసదనంలో సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 203.300 గ్రాముల బంగారం, 18.500 కిలో వెండి లభించినట్టు ఈవో పేర్కొన్నారు. రోజుకి సరాసరి రూ.9, 73, 900 వచ్చినట్టు తెలిపారు.

4,903 మంది ఉపాధ్యాయులకు బదిలీ

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో 4,903 మంది ఉపాధ్యాయులకు బదిలీ జరిగినట్లు డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఉపాధ్యాయ బదిలీలతో పాటు అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కూడా కల్పించినట్లు పేర్కొన్నారు. బదిలీల్లో 89 మంది గ్రేడ్–2 ఎచ్ఎంలు, 177 మంది మోడల్ ప్రైమరీ పాఠశాలల హెచ్ఎంలు, 78 మంది లాంగ్వేజ్ పండిట్‌లు, 10 మంది పీఈటీలు, 15 మంది ఆర్ట్, క్రాఫ్ట్, మ్యూజిక్, ఇతరులు, 2,305 మంది స్కూల్ అసిస్టెంట్లు సమానమైన హోదా కలిగినవారు, 2,229 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు బదిలీలు జరిగినట్లు తెలిపారు. అలాగే 153 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామన్నారు. గ్రేడ్–2 హెచ్ఎంలుగా 72 మందికి, ప్రైమరీ పాఠశాలల హెచ్ఎంలుగా 36 మందికి, స్కూల్ అసిస్టెంట్లుగా ఇంగ్లిష్–1, హిందీ–2, తెలుగు–2, బయోలజీ–16, గణితం–3, ఫిజికల్ ఎడ్యుకేషన్(పీడీ)–12, సోషల్ స్టడీస్–9 మందికి పదోన్నతులు కలించినట్లు తెలిపారు. పదోన్నతులు పొందినవారు, బదిలీలు జరిగినవారు కొత్త స్థానాల్లో చేరి సోమవారం నుంచి విధులు నిర్వహిస్తున్నారన్నారు.

డీఎస్సీ పరీక్షలకు 116 మంది గైర్హాజరు

ఆరిలోవ: డీఎస్సీ పరీక్షలకు సోమవారం 116 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. డీఎస్సీ పరీక్షలు ఈనెల 6 నుంచి జరుగుతున్న విషయం తెలిసిందే. సోమవారం నిర్వహించిన పరీక్షకు 2,576 మందికి హాల్ టికెట్లు పంపించగా వారిలో 2,460 మంది పరీక్ష రాశారు. మిగిలిన 116 మంది గైర్హాజరయ్యారు. ఉదయం ఏడు కేంద్రాల్లో 1,225 మంది, మధ్యాహ్నం 7 కేంద్రాల్లో 1,235 మది పరీక్ష రాశారు.

పీజీ పరీక్షల డీన్‌గా ఆచార్య మునిస్వామి



ఏయూ వీసీ నియామక పత్రం స్వీకరిస్తున్న మునిస్వామి

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ పరీక్షల విభాగంలో పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల డీన్‌గా ఆచార్య బి. మునిస్వామి సోమవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఆంధ్రా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ నుంచి నియామక ఉత్తర్వులను అందుకున్న ఆచార్య మునిస్వామి, అనంతరం బాధ్యతలను స్వీకరించారు.





యోగాంధ్రకు సర్వం సన్నద్ధం



చురుగ్గా సుందరీకరణ పనులు

మొత్తం కంపార్ట్‌మెంట్లు	మెడికల్ క్యాంప్‌లు
326	50
అంబులెన్సులు	10 పడకల ఆస్పత్రులు
116	3

జన సమీకరణ

విద్యా శాఖ	58,000
మెప్మా	2,50,000
సెర్ప్	50,000
డిఫెన్స్	12,000
సీఐఐ, పరిశ్రమలు	5,500
వీవీఐపీలు	150
ఇతర జిల్లాల నుంచి	1,25,000

21న విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

- పాల్గొననున్న ప్రధాని మోదీ
- నగరంలో 5 లక్షల మందితో యోగాసనాలు
- ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 326 కంపార్ట్‌మెంట్ల ఏర్పాటు
- 3.5 లక్షల యోగా మ్యాట్లు సిద్ధం
- గిన్నిస్ రికార్డు కోసం ప్రణాళికలు
- 21న విద్యా సంస్థలకు సెలవు



ఏయూలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న చంద్రబాబు

విశాఖ సిటీ: యోగాంధ్రకు నగరం ముస్తాబవుతోంది. ఐదు లక్షల మంది యోగాసనాలకు విశాఖ వేదిక అవుతోంది. గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కేందుకు సమాయత్తమవుతోంది. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ఈ నెల 21వ తేదీన విశాఖ ఆతిథ్యమిస్తోంది. ఈ కార్యక్రమానికి దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, అనేక మంది ప్రముఖులు ఈ వేడుకకు తరలిరానున్నారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలను సైతం పెద్ద సంఖ్యలో భాగస్వాములను చేసేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఈ కార్యక్రమం దృష్ట్యా విద్యా సంస్థలకు 21 తేదీన సెలవుగా ప్రకటించారు.

2 కి.మీ మేర ప్రధాన వేదిక

ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు కాళీమాత ఆలయం నుంచి పార్కు హోటల్ వరకు ప్రధాన వేదిక కానుంది. ఇక్కడే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రముఖులు, నేవీ అధికారులు, అధికారులు యోగాసనాలు చేయనున్నారు. ఈ రెండు కిలోమీటర్ల మేర ప్రధాన వేదికలో 12 కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి కంపార్ట్‌మెంట్‌లో వెయ్యి మంది ఉంటారు. ప్రధాన వేదిక తర్వాత సీ1 కంపార్ట్‌మెంట్ ఉంటుంది. పార్కు హోటల్ వరకు మొత్తం 12 కంపార్ట్‌మెంట్లు ఉంటాయి. సీ6 వరకు 9 వేల మంది ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డు సిబ్బందితో పాటు, ఇంటర్నేషనల్ యోగా స్టూడెంట్స్, యోగా అసోసియేషన్ సభ్యులు, వివిధ స్థాయిల్లో యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు పాల్గొంటారు. అలాగే సీ7 నుంచి సీ12 వరకు గల కంపార్ట్‌మెంట్లలో సమీపంలోని నివాసితులు భాగస్వామ్యమవుతారు. ఈ ప్రధాన వేదిక వద్ద పాల్గొనే వారి అవసరాలకు అనుగుణంగా 1400 టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రధాన వేదిక ప్రాంతంలో అదనపు కంపార్ట్‌మెంట్లతో కలిపి మొత్తం 15 వేల మంది పాల్గొననున్నారు. ఒక వేళ వర్షం పడితే ఈ ప్రధాన వేదికను ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలోకి మార్చనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

విదేశీ విద్యార్థుల రాక

ఈ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు విదేశీ విద్యార్థులు రానున్నారు. 13 దేశాలకు చెందిన 76 మంది విద్యార్థులు ఈ నెల 20న విశాఖకు చేరుకోనున్నారు. ముందు వీరికి కోవిడ్ పరీక్షలు నిర్వహించనున్నారు. అనంతరం మూడు ప్రత్యేక బస్సుల్లో కంపార్ట్‌మెంట్లకు తీసుకురానున్నారు.

భారీ భద్రతా ఏర్పాట్లు

భారీ స్థాయిలో చేపడుతున్న యోగాంధ్ర వేడుకలకు పోలీసులు కూడా భారీ భద్రతా చర్యలు చేపడుతున్నారు. ప్రధాన వేదిక వద్దే కాకుండా ప్రతి కంపార్ట్‌మెంట్ వద్ద పోలీసు బందోబస్తు కల్పిస్తున్నారు. ఇప్పటికే నగరంలో బాంబ్ తనిఖీ బృందాలతో నిశితంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఒకవైపు భద్రతా చర్యలతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించారు. యోగాంధ్రకు వచ్చే వాహనాలతో జాతీయ రహదారిలో ట్రాఫిక్ పెరిగే అవకాశముంది. దీంతో ఆ రోజున కొన్ని గంటల పాటు సాధారణ వాహనాల మళ్లింపుపై దృష్టి పెట్టారు. ఆ రోజు పోర్టు నుంచి లారీ రాకపోకలు నియంత్రించనున్నారు.

- ✓ ఆర్కే బీచ్ రోడ్‌లోని కాళీమాత ఆలయం నుంచి భీమిలి వరకు ఏకకాలంలో 5 లక్షల మంది యోగాసనాలు చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
- ✓ మొత్తంగా 326 కంపార్టుమెంట్లు సిద్ధం చేస్తున్నారు. ప్రధాన వేదిక మినహా మిగిలిన కాంపార్ట్‌మెంట్లలో 3.5 లక్షల మందికి చోటు కల్పిస్తున్నారు.
- ✓ ప్రజలు కంపార్ట్‌మెంట్లలోకి చేరుకున్న తర్వాత టీషర్టు, క్యూఆర్ కోడ్ అందజేస్తారు.
- ✓ ప్రతి దాంట్లో గెజిటెడ్ ర్యాంకు అధికారి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారు.

326 కంపార్ట్‌మెంట్లు

- ✓ తాగునీరు, పారిశుధ్యం, ఆహారం, వైద్య సిబ్బందితో పాటు పోలీసులతో పాటు 10 మంది వలంటీర్లు ఒక్కో కంపార్ట్‌మెంట్‌లో అందుబాటులో ఉంటారు.
- ✓ ప్రతి రెండు లేదా మూడు కంపార్ట్‌మెంట్లకు అనుబంధంగా 20 బెడ్లతో కూడిన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు.
- ✓ విశాఖ నుంచే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో జనసమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు.
- ✓ ప్రజలను తరలించేందుకు మొత్తంగా 10,235 ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలను వినియోగించనున్నారు.
- ✓ ఆయా ప్రాంతాల నుంచి ప్రజలను కంపార్ట్‌మెంట్లకు తరలించేందుకు వీలుగా ముందుగా రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు.
- ✓ దాని ప్రకారం ఎవరు ఏ కంపార్టమెంట్‌లోకి వెళ్లాలన్న విషయాన్ని మ్యాపింగ్ చేస్తున్నారు.
- ✓ దానికి అనుగుణంగానే ప్రజలు వారికి కేటాయించిన కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి నెంబర్ ప్రకారం స్థానంలో కూర్చోవాల్సి ఉంటుంది.

22 రికార్డులు దక్కేలా..

అంతర్జాతీయ యోగా డే వేడుకల ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లోకి ఎక్కేందుకు యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఏకంగా 12 రికార్డులు దక్కించుకునేందుకు కసరత్తు చేస్తోంది. విశాఖ సముద్ర తీరంలో 11 నావికాదళ నౌకలపై నేవీ అధికారులు, సిబ్బంది యోగాసనాలు వేయనున్నారు. ఇది కూడా రికార్డు క్రియేట్ చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అల్లూరి జిల్లాకు చెందిన 25 వేల మంది గిరిజన విద్యార్థులు ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో యోగా చేయనున్నారు. ఇది కూడా రికార్డు నెలకొల్పే అవకాశముంది. ఇలా మొత్తంగా 22 రికార్డులు సొంతం చేసుకునేందుకు చర్యలు చేపడుతున్నారు. దీనిపై ఇప్పటికే గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు ప్రతినిధులకు సమాచారం అందించారు. సాంకేతిక సాయంతో గిన్నిస్ బుక్ వాళ్లు లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు.

ఐదు నెలల నిరీక్షణకు తెర

జీవీఎంసీ కమిషనర్‌గా కేతన్‌గార్గ్



దాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు దాదాపు ఐదు నెలల నిరీక్షణ తర్వాత ప్రభుత్వం సోమవారం నూతన కమిషనర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఐదు నెలలుగా కమిషనర్ లేకపోవడంతో పాలనలో తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన కేతన్ గార్గ్ (రాజస్థాన్‌కు చెందిన 2018 బ్యాచ్ ఐఏఎస్ అధికారి) జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా, విజయనగరం, రాజాంపేటలో వివిధ హోదాల్లో గార్గ్ పనిచేశారు.

అస్తవ్యస్త పాలన గాడిన పడేనా?

దాదాపు 20 లక్షలకు పైబడిన జనాభా, 98 మంది కార్పొరేటర్లు, ఎనిమిది జోన్లతో కూడిన జీవీఎంసీకి ఐదు నెలలుగా కమిషనర్ లేకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కలెక్టరేట్ విధులు, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ బాధ్యతలను ఏకకాలంలో నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ కారణంగా ఫైల్స్ నిలిచిపోవడంతో పాటు, నగర పౌరులకు సేవలు సక్రమంగా అందలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కింది స్థాయి అధికారులు తూతూ మంత్రంగా విధులు నిర్వహించడంతో పనులు అరకొరగా సాగాయి. అధికారులను నిలదీసే పాలకవర్గం కూడా మొక్కుబడిగా పాలన సాగిస్తోందని కౌన్సిల్ సభ్యులే గతంలో వాపోయారు.

ప్రభుత్వంపై ఒత్తిడి, కలెక్టర్‌కు ఉపశమనం

ఇటీవల నిర్వహించిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో కమిషనర్‌ను నియమించాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పట్టుబట్టారు. కీలకమైన కమిషనర్ పోస్టును నెలల తరబడి భర్తీ చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు కూడా జీవీఎంసీకి ఐదు నెలలుగా కమిషనర్ లేకపోవడం దౌర్భాగ్యమని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వెంటనే కమిషనర్‌ను నియమించేలా చూడాలని అన్నారు. ఈ నేపథ్యంలో నూతన కమిషనర్ నియామకంతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ కొంత ఉపశమనం పొందారని పలువురు అధికారులు చెబుతున్నారు.

మెట్రో మొదటి దశ పనుల పరిశీలన



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

మహారాణిపేట: విశాఖపట్నంలో మెట్రో రైలు విస్తరణ, అభివృద్ధిలో భాగంగా మొదటి దశ పనులను అధికారులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కారిడార్ 1, 2, 4 నిర్మాణ ప్రాజెక్టు 46.23 కిలోమీటర్ల మేర సాగనుంది. ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని రెవెన్యూ భూసేకరణ అధికారులు సోమవారం పరిశీలించారు. మెట్రో ప్రాజెక్టు కోసం అవసరమైన భూసేకరణ నిమిత్తం సమగ్ర నివేదికను రూపొందించడానికి కలెక్టర్ సోషల్ ఇంపాక్టు అసెస్మెంటు(ఎస్ఐఏ) కమిటీని నియమించారు. ఈ కమిటీ సోమవారం వివిధ ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయి వివరాలను సేకరించి నివేదిక తయారీలో నిమగ్నమైంది. మెట్రో పథకం కోసం గాజువాక, గోపాలపట్నం మండలాల్లోని పలు గ్రామాలతో పాటు విశాఖ నగరం, విశాఖ గ్రామీణ మండలం, విశాఖ జోన్–3, జోన్–4, జోన్–5లలోని నిర్దిష్ట వార్డుల నుంచి భూములను ఎంపిక చేశారు. మొత్తం 9.22 ఎకరాల పట్టా భూమితో పాటు, అదనంగా 87 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించాల్సి ఉంది. నూతన భూసేకరణ చట్టం 2013 ప్రకారం, భూసేకరణకు ముందుగా సామాజిక ప్రభావ అంచనా నివేదికను తప్పనిసరిగా తయారు చేయాలి. ఈ నివేదిక రూపకల్పనకు నియమించిన బృందంలో మెట్రో ప్రాజెక్టు డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి, సర్వేయర్ శ్రీనుబాబు, ఎస్ఐఏ సామాజిక నిపుణులు పి.దేవరాజ్, సభ్యులు శ్రీనివాస్, మెట్రో రైలు ప్రాజెక్టు ఇంజనీర్ లక్ష్మణ్, రెవెన్యూ సిబ్బంది, భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు. భూసేకరణకు అవసరమైన భూములను, అలాగే నష్టపోయే గృహ, వ్యాపార నివాసాలను బృందం పర్యవేక్షించింది. నిర్వాసితులను నేరుగా కలిసి వారి సామాజిక, ఆర్థిక, సాంఘిక స్థితిగతులను తెలుసుకుని, వారి వివరాలను నమోదు చేసుకునేందుకు ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

విశాఖలో ఏర్పాట్లను పరిశీలించిన సీఎం చంద్రబాబు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు

మహారాణిపేట/ఏయూక్యాంపస్: విశాఖలో ఈనెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే ఈ కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు సోమవారం విశాఖ వచ్చిన సీఎం చంద్రబాబు ఆర్కే బీచ్ నుంచి రుషికొండ సమీపంలోని గీతం యూనివర్సిటీ వరకూ క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. యోగా డేలో పాల్గొనే వారితో మాక్ యోగా నిర్వహించాలని సూచించారు. యోగా డే ఏర్పాట్లను యోగాంధ్ర 2025 నోడల్ అధికారి ఎం.టి కృష్ణబాబు వివరించారు. ట్రాఫిక్‌కి అంతరాయం కలగకుండా, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం ఏయూ మైదానంలో జరుగుతున్న పనులను సీఎం పరిశీలించారు. ఏయూ మైదానంలో విద్యార్థులతో యోగా చేయించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. అనంతరం ప్రజా ప్రతినిధులు, అధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. విశాఖలో చారిత్రక వేడుకకు నాంది పలుకుతున్నామన్నారు. యోగా డేలో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. యోగా డే నిర్వహణకు సంబంధించి భారతీయ నౌకాదళం కూడా 11 నౌకల్ని ఆర్కే బీచ్ సమీపంలో ప్రదర్శించనుందని వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ ఎం.శ్రీభరత్, సిఎస్ కె.విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమశాఖ మాజీ డీడీలకు ప్రభుత్వం తాఖీదు

ఎంవీపీకాలనీ: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్లు వి.విజయప్రకాష్, డి.వి. రమణమూర్తిలకు ప్రభుత్వం తాఖీదులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి ఎం.ఎం. నాయక్ సోమవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో విశాఖలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్లుగా వీరు సేవలు అందించారు. అయితే 2017లో పీజీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల మంజూరుకు సంబంధించి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ పరిశీలనలో తప్పిదాలు జరిగినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ విజిలెన్స్ విచారణలో వెల్లడైందని ఈ ఉత్తర్వులలో పేర్కొన్నారు. పీజీ విద్యార్థుల దరఖాస్తులను జ్ఞానభూమి పోర్టల్ లాగిన్ ద్వారా పరిశీలించి, వారి అర్హతను నిర్ధారించాల్సిన డిప్యూటీ డైరెక్టర్లు తమ విధి నిర్వహణలో విఫలమైనట్లు ఉత్తర్వులలో ఆరోపించారు. పలు ప్రైవేట్ కళాశాలల పీజీ విద్యార్థులకు మంజూరైన స్కాలర్‌షిప్‌లలో అవకతవకలు గుర్తించినట్లు కూడా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి చర్యలకు ముందుగా డీవీ రమణమూర్తి , వి. విజయప్రకాష్‌ల వివరణ కోరుతూ సోమవారం ఈ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ప్రస్తుతం డీడీ విజయప్రకాష్ సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఏలూరులో బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, డీడీ రమణమూర్తి విశాఖ నగర పాలక సంస్థలో అడిషనల్ జాయింట్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విశాఖలో విధులు నిర్వర్తించిన ఈ ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లపై ఆరోపణలు రావడం సంచలనంగా మారింది.

యోగా డేకు అధికారుల నియామకం

దాబాగార్డెన్స్: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొంటున్న దృష్ట్యా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పలువురు అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రిన్సిపాల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కేడర్ ఆఫీసర్స్‌గా విజయవాడ మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, గుంటూరు మున్సిపల్ కమిషనర్ పి.శ్రీనివాసులు, విశాఖపట్నం ఆర్‌డీఎంఏ వరరవీంద్ర, రాజమహేంద్రవరం ఆర్‌డీఎంఏ నాగ నరసింహారావును నియమించారు. నాన్ కేడర్ ఆఫీసర్స్‌గా కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, గుడివాడ మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, బాపట్ల మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వేంకటేశ్వరరావు, నరసారావుపేట మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు, తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణను నియమించారు. వీరిలో కమిషనర్ స్థాయి అధికారులు యోగా ప్రారంభ కార్యక్రమాలు, ఏర్పాట్లు పర్యవేక్షించనున్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలుచేయాలి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

బీచ్‌రోడ్డు: అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సాధికార సర్వేలో 'ప్రభుత్వ ఉద్యోగి' అనే పదాన్ని తొలగించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం జీవీఎంసీ వద్ద గల గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకురాలు కె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీలు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వారికి ఇస్తున్నది కేవలం గౌరవ వేతనం మాత్రమేనని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఆరేళ్లుగా వేతనాలు పెంచలేదని, ధరలు ఆకాశాన్నంటుతున్నా ప్రభుత్వం ఈ విషయాన్ని విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. 'తల్లికి వందనం', పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్లు, ఇంటి స్థలాలు వంటి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి అంగన్‌వాడీ వర్కర్‌కు, హెల్పర్‌కు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు మణి, గౌరవ సలహాదారు బృందావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవి, కోశాధికారి కె. పద్మావతి, జిల్లా నాయకులు శ్రీదేవి, సత్యవతి, బేగం, శివలక్ష్మి, వెంకటలక్ష్మి, దుర్గ, మాధురి, సుగుణ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడి తీరుతాం

మధురవాడ: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని గతంలో కాపాడింది తమ ప్రభుత్వమేనని, భవిష్యత్తులో కూడా తామే కాపాడబోతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మధురవాడలోని వి-కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. విశాఖ నగరాన్ని ముంబై తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని, తద్వారా పౌర విమానయాన సేవలు మరింత విస్తరిస్తాయని పేర్కొన్నారు. తాను పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, 1995 నాటి తన పనితీరును మళ్లీ చూస్తారన్నారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెబుతూ, ప్రతిపక్ష నాయకుడు వై.ఎస్. జగన్‌మోహనరెడ్డిపై విమర్శలు చేశారు.

పల్లా ఇంటికి చంద్రబాబు



పల్లా కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

సీతంపేట: సీతంపేటలోని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నివాసానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు. ఇటీవల శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం మృతి చెందడంతో కుటుంబ సభ్యులను సీఎం పరామర్శించారు.పల్లా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

సీఎం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు



ముఖ్యమంత్రికి వినతి పత్రం అందిస్తున్న గంట్ల శ్రీనుబాబు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి జర్నలిస్టుల సమస్యలను జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు తీసుకెళ్లారు. సోమవారం విశాఖ విమానాశ్రయంలో సీఎంకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న 11 సమస్యలను ఆయనకు వివరించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ కమిటీల నియామకం



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ విశాఖ జిల్లా 19 అనుబంధ విభాగాల కమిటీలను నియమించారు. ఈ మేరకు సోమవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

- జిల్లా బూత్ విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ సఖి, కార్యదర్శులుగా చట్టి నూకరాజు, ఈది మధుబాబు, ఇద్దరు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ను నియమించారు.
- జిల్లా అంగన్‌వాడీ విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శులుగా కొల్లి రమణమ్మ, పిలకా వరలక్ష్మి, కార్యదర్శులుగా సికల అనిత, పాల కుసుమకుమారితో పాటు నలుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ను నియమించారు.
- జిల్లా బీసీ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా పాతపట్నం రామ్మోహన్, ఎన్నెటి రమణ, గంగల్ల లక్ష్మణరావు, కార్యదర్శులుగా వారధి పార్థి నరసింహమూర్తి, శిస్తు చంద్రశేఖర్‌తో పాటు తొమ్మిది మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌కు చోటుకల్పించారు.
- జిల్లా క్రిస్టియన్ మైనారిటీ విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మోకాన సుధాకర్, ప్రధాన కార్యదర్శులుగా గొట్టివాడ దానయ్య, బండుకొండ నాగమణి, కార్యదర్శులుగా దమ్ము గోవింద్, కొండపల్లి చిట్టితల్లి, గంట్యాడ రూపావతితో పాటు ముగ్గురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లగా అవకాశం కల్పించారు.
- జిల్లా సాంస్కృతిక విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా విశాఖ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన పడాల స్వప్న, ప్రధాన కార్యదర్శిగా శరగడం పద్మ, కార్యదర్శిగా కోన లక్ష్మితో పాటు నలుగురికి ఎగ్జిక్యూటివ్ మెంబర్లగా స్థానం కల్పించారు.
- జిల్లా వైఎస్సార్‌టీయూసీ విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా గాలి ప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా పిలకా వెంకట రమణ, కైలాస్ మాలిక్, కార్యదర్శులుగా వరపాల మహేష్, నడుపూరి అనిల్‌కుమార్, కంచు మూర్తి వెంకట రమణతో పాటు నలుగురిని ఎగ్జిక్యూటివ్ మెంబర్లగా నియమించారు.
- జిల్లా చేనేత విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మీసాల రత్నం, ప్రధాన కార్యదర్శిగా నీలి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కాపు విజయ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కాలిపాక సంధ్యను నియమించారు.
- జిల్లా వలంటీర్ విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా దూడ అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా అన్నెపు సూర్యనారాయణ, కార్యదర్శులుగా డి.స్వరూపరాణి, గొండేసి గోవింద్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా బి.మోహన్‌రావు, జి.సూర్య ప్రకాష్, యాసలపు శ్రీనివాసరావు, బొజ్జ సంతోష్ సాగర్, శ్రీమంతపురం బానూజీరావు, బొడ్డు దుర్గారావు, బేతా శ్రీనివాసరావును నియమించారు.
- జిల్లా వాణిజ్య విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శిగా దొడ్డి రమేష్‌కుమార్, కార్యదర్శులుగా వెలుగల జగదీష్, చెరుకూరి కుమార్, మీసాల సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లగా బి.దంతేశ్వరరావు, పులేకుర్తి శ్రీనివాసరావు, పశుపురెడ్డి అప్పారావు, చేకూరి ముకుందరావు, కోరాడ శ్రీనివాసరావును నియమించారు.
- జిల్లా సోషల్ మీడియా విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శులుగా తంగ్రంగి మహేష్‌బాబు, నల్ల రామకృష్ణ, వాసు పొట్నూరు, కార్యదర్శిగా కాంగ్రేగుల త్రినాథ్‌తో పాటు ఏడుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు
- జిల్లా ఎస్సీ విభాగం కమిటీ వైస్ ప్రెసిడెంట్‌లుగా కోనా శంకర్, ఎడ్ల సిద్ధార్థరాజు, ముంజేటి హనుమంతురావు, ప్రధాన కార్యదర్శిగా ఆరుగుల అప్పన్న, కార్యదర్శులుగా ధనల ఆంజనేయుల బాబు, గారా కృపారావు, నేతల కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా 12 మందిని నియమించారు.
- జిల్లా ఆర్‌టీఐ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా కోడూరి సుశీల, ప్రధాన కార్యదర్శులుగా మహదశ్యం గోపి, గంట్యాడ కృష్ణమూర్తి, కార్యదర్శులు కె.సీతయ్యరెడ్డి, నక్క త్రినాథ్‌తో పాటు ఐదుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ను నియమించారు.
- జిల్లా ప్రచార విభాగం కమిటీ ప్రెసిడెంట్‌గా జలకర్ర నాగేంద్ర, ప్రధాన కార్యదర్శులుగా కసరి ఫణిదీప్తి, యలమంచిలి అప్పారావు యాదవ్, గవర నాయుడు, కార్యదర్శులుగా కోరబిల్లి మహేష్, బోరా అప్పలరెడ్డి, కొండపు సత్తిబాబుతో పాటు ఆరుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ను నియమించారు.
- జిల్లా మైనారిటీ విభాగం కమిటీలో ప్రధాన కార్యదర్శులుగా నజమే అబ్బాస్, షేక్ రహమన్, కార్యదర్శులు మహ్మద్ హర్షద్, మహమద్ కరీన్ మిరిష్, షేక్ రజియ్య, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌ను నియమించారు.
- జిల్లా మహిళా విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శులుగా శరగడం వెంకట లక్ష్మి, పిలిరిచెట్టి సుజాత, కార్యదర్శులుగా మెట్ట దమయంతి, బాసంగి రాజేశ్వరి, కార్యదర్శులుగా కాంద్రుగుల కనకలక్ష్మి, కరణం లక్ష్మి, ఆరుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు
- జిల్లా న్యాయ విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శులుగా ఎండిబోయిన లక్ష్మి, రాయుడు సుబ్రహ్మణ్యం రవి, కార్యదర్శిగా వాగుపల్లి చిన్నారావును నియమించారు
- జిల్లా ఐటీ వింగ్ కార్యదర్శిగా గర్భాపు శ్యామ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కోటాన శ్రీనివాసరావు, జిల్లా ఇంటలెక్చువల్స్ ఫోరం ప్రధాన కార్యదర్శిగా పేరం రామకృష్ణను నియమించారు.
- జిల్లా గ్రీవెన్స్ సెల్ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా అల్లు రామగోవిందేశ్వరరావు, పెదిరెడ్డి చంద్రశేఖర్, కార్యదర్శులుగా జిరు శ్రీనివాస్, చరకాపు రామారావుతోపాటు ఏడుగురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు.

మేయర్‌ను పట్టించుకోని ఎమ్మెల్యే

- వంశీకృష్ణ ఏకపక్ష వైఖరి
- మేయర్, స్థానిక కార్పొరేటర్‌కు తెలియకుండానే భూమిపూజ



భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ ఏకపక్ష నిర్ణయాలు విమర్శలకు దారితీశాయి. నగర ప్రథమ పౌరుడైన మేయర్ పీలా శ్రీనివాసరావు అభ్యంతరాలు వ్యక్తం చేసినా, స్థానిక కార్పొరేటర్‌కు సమాచారం ఇవ్వకుండానే వార్డు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ పర్యటన మూడు రోజుల ముందుగానే ఖరారైనప్పటికీ, ఎమ్మెల్యే హడావుడిగా భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించడం వెనుక ఆంతర్యం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. యోగాంధ్ర కార్యక్రమం ప్రపంచ స్థాయిలో జరుగుతున్న నేపథ్యంలో, ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి స్వయంగా విశాఖ వస్తున్న తరుణంలో భూమిపూజ కార్యక్రమాన్ని వేరొక రోజుకు మార్చుకుందామని మేయర్ పీలా శ్రీనివాసరావు సూచించారు. అయితే ఎమ్మెల్యే వంశీకృష్ణ మాత్రం మేయర్ సూచనలను బేఖాతర్ చేయడంపై 'నగర ప్రథమ పౌరుడికిచ్చే గౌరవం ఇదేనా?' అంటూ కూటమి నేతల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

కార్పొరేటర్‌కు సమాచారం లేదు

వార్డు అభివృద్ధి పనులకు సంబంధించి సోమవారం జరిగిన భూమిపూజ సందర్భంగా కనీసం స్థానిక కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్‌కు కూడా సమాచారం ఇవ్వకుండా, తన పార్టీకి చెందిన కొందరు చోటా నాయకులతోనే ఎమ్మెల్యే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తన వార్డులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన భూమిపూజ విషయంలో తనకెందుకు సమాచారం ఇవ్వలేదో చెప్పాలని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ సదరు ఎమ్మెల్యేను ప్రశ్నించారు.

కౌన్సిల్‌లో పోరాడి నిధులు సాధించిన కార్పొరేటర్

జీవీఎంసీ 41వ వార్డు అభివృద్ధి పనులకు సంబంధించి స్థానిక కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్ కౌన్సిల్‌లో పోరాడారు. సుమారు రూ.10 కోట్లకు పైగా నిధులు సాధించి, వార్డు సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తున్నారు. ఇదిలా ఉండగా సొంత నిధులతో వార్డుకు సేవలందిస్తున్న కార్పొరేటర్ లేకుండా, హోల్‌సేల్ మార్కెట్, క్రిస్టియన్ శ్మశాన వాటిక మౌలిక వసతులకు కనీసం ప్రజాప్రతినిధులతో సంబంధం లేకుండా భూమిపూజ చేయడపై స్థానికులు విస్మయం వ్యక్తం చెందారు.

రైల్వేస్టేషన్‌లో గేట్ నంబర్ 3 మూసివేత

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో చేపట్టనున్న అభివృద్ధి, నిర్మాణ పనుల నిమిత్తం గేట్ నంబర్ 3 ను సోమవారం నుంచి తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ తెలిపారు. ఈ గేటు ద్వారా సౌత్ ఎండ్‌లో ఉన్న 6-8 ప్లాట్‌ఫామ్‌లకు కూడా రాకపోకలు సాగించే విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అయితే ఈ గేట్ ద్వారా ప్లాట్‌ఫాం 2, 3లకు మాత్రం రాకపోకలు యథావిధిగా కొనసాగుతాయి. మిగిలిన ప్లాట్‌ఫామ్‌లకు చేరుకోవాల్సిన ప్రయాణికులు స్టేషన్‌లో ఉన్న ఇతర రెండు గేట్లను, లిఫ్ట్‌లను ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఈ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

పాలిటెక్నిక్ హెడ్‌లకు స్థానచలనం

మురళీనగర్: ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల్లో పని చేస్తున్న విభాగాధిపతులకు స్థానచలనం కలిగింది. స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన బదిలీల్లో పలువురు తాము ప్రస్తుతం పనిచేస్తున్న కాలేజీల నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. భీమిలి మహిళా పాలిటెక్నిక్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ హెడ్ పి. శ్రీనివాస్‌కు చినమేరంగికి బదిలీ అయింది. ఆయన స్థానంలో కళ్యాణదుర్గం నుంచి సూర్య శ్రీధర్ కుమార్ వచ్చారు. యు. ప్రమీల (కంప్యూటర్ ఇంజినీరింగ్ హెడ్) శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కాలేజీకి బదిలీ అయ్యారు. కంచరపాలెం (విశాఖపట్నం) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి సివిల్ హెడ్ జె. రాజేంద్రప్రసాద్ మదనపల్లి రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రేపల్లి నుంచి వి. సంధ్యారాణి వచ్చారు. ఎలక్ట్రికల్ హెడ్ కేడీవీ నరసింహారావు పార్వతీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కదిరి నుంచి డాక్టర్ ఎం. నారాయణ వచ్చారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో పార్ట్‌టైమ్ కోఆర్డినేటర్‌గా పనిచేసిన ఈసీఈ హెడ్ వి. శ్రీనివాసరావు..రాజమండ్రి రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కాలేజీకి బదిలీ అయ్యారు. ఖాళీగా ఉన్న కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ స్థానానికి గుంటూరు మైనారిటీస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ నుంచి ఎం. మహాలక్ష్మి బదిలీపై వచ్చారు. నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాల నుంచి ఈసీఈ హెడ్ సి.హెచ్. వెంకటనరసింహం ఆముదాలవలస పాలిటెక్నిక్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజమండ్రి నుంచి డాక్టర్ ఎ. నాగరాజు వచ్చారు.



యోగా డే.. ప్రజల భాగస్వామ్యంపై జేసీ ఆదేశాలు

మహారాణిపేట: ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఏయూ అసెంబ్లీ హాల్‌లో యోగా కంపార్ట్‌మెంట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రధాని పాల్గొననున్నారని తెలిపారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు ఏర్పాటు చేసే కంపార్ట్‌మెంట్లలో యోగా చేసే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రెవెన్యూ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ప్రజలను సురక్షితంగా తరలించాలని సూచించారు.

యోగా వేడుకలకు ట్రాఫిక్ ఆంక్షలు

విశాఖ సిటీ: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20, 21వ తేదీల్లో నగరానికి ప్రధాని మోదీ, ఇతర వీవీఐపీలు, వీఐపీల తాకిడి ఉండడంతో అందుకు అనుగుణంగా భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే యోగాంధ్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వాహనాల్లో ప్రజలు తరలిరానున్నారు. దీంతో 20, 21 తేదీల్లో నగరంలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు పలు సూచనలు చేశారు.

- ఆర్కే బీచ్‌లో సభా వేదిక ఏర్పాట్లు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పార్కు హోటల్ జంక్షన్ వరకు పూర్తిగా బీచ్ రోడ్డును మూసివేస్తున్నారు.
- బీచ్ రోడ్డుకు అనుకుని ఉన్న నివాసితులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలి.
- పార్క్ హోటల్ జంక్షన్ నుంచి భీమిలి బీచ్ వరకు బీచ్ రోడ్ అంతా యోగ స్టేజీలు ఏర్పాటు చేయాల్సి ఉండడంతో 19 నుంచి 21 వరకు అన్ని రకాల సాధారణ వాహనదారులను, బీచ్‌కు వచ్చే సందర్శకులను అనుమతించరు.

వీఐపీ పార్కింగ్

- బీచ్ రోడ్డులో సభా వేదికకు వచ్చే వీఐపీ వాహనదారులు వారి వాహనాలను సిరిపురం, సీఆర్ రెడ్డి సర్కిల్, ఆల్ ఇండియా రేడియో జంక్షన్ మీదుగా ఏపీఐఐసీ గ్రౌండ్‌కు చేరుకుని అక్కడ నిర్దేశించిన ప్రదేశంలో నిలపాలి. అక్కడి నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాల్ మీదగా కాలి నడకన సభా ప్రాంగణానికి చేరుకోవాలి.
- ఏయూ గ్రౌండ్‌లో ఉన్న సభా వేదికకు వచ్చే వీఐపీ వాహనదారులు మద్దిలపాలెం ఆర్చ్ మీదుగా ఏయూలోకి ప్రవేశించి భాస్కర హాస్టల్ వద్ద పార్కు చేసుకోవాలి.

సాధారణ వాహనదారులు

- శ్రీకాకుళం నుంచి యోగాలో పాల్గొనేందుకు వచ్చే బస్సులు శ్రీకాకుళం, భోగాపురం, తగరపువలస, చిలకపేట, భీమిలి మీదుగా బీచ్ రోడ్డుకు చేరుకోవాలి. వారికి అధికారులు కేటాయించిన కంపార్ట్‌మెంట్లకు చేరుకోవాలి.
- విజయనగరం నుంచి యోగా కోసం వచ్చే బస్సులు విజయనగరం, తగరపువలస, బోయపాలెం దగ్గర ఎడమ వైపునకు తిరిగి బీచ్ రోడ్డుకు చేరుకోవాలి. అక్కడి నుంచి కేటాయించిన కంపార్ట్‌మెంట్లలోకి వెళ్లాలి.
- అనకాపల్లి నుంచి వచ్చే బస్సులు అనకాపల్లి, పెందుర్తి, వేపగుంట, అడవివరం హనుమంతవాక, ఎండాడ మీదుగా లా కాలేజ్ రోడ్డుకు చేరుకోవాలి.
- అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి వచ్చే బస్సులు వేపగుంట, అడవివరం హనుమంతవాక మీదుగా ఎంవీపీ డబుల్ రోడ్డుకు చేరుకుని అక్కడి నుంచి విశాఖ కంటి ఆసుపత్రి రోడ్డు ద్వారా గాని, విషు హోండా జంక్షన్ మీదుగా గాని, మద్దిలపాలెం జంక్షన్ మీదుగా గాని ఏయూ ప్రాంగణానికి చేరుకోవాలి.
- ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు యోగాలో పాల్గొనేందుకు వచ్చే విశాఖ వాహనదారులు హైవే ద్వారా ప్రయాణించి, హైవే నుంచి ఉన్న అప్రోచ్ రోడ్ ద్వారా ఎంవీపీ డబుల్ రోడ్డు, వెంకోజీపాలెం, హనుమంతవాక, విశాఖ వ్యాలీ, ఎండాడ, లా కాలేజ్, మారికవలస, బోయపాలెం, తగరపువలస మార్గాల ద్వారా బీచ్ రోడ్డుకు చేరుకోవాలి.

వాహనాల మళ్లింపు

- ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 12 నుంచి వాహనాలను మళ్లింపు చేపడుతున్నారు.
- తగరపువలస జాతీయ రహదారి నుంచి భీమిలి వైపు భారీ వాహనాల రాకపోకలు నిషేధించారు.
- ఆనందపురం ఫ్లై ఓవర్ నుంచి విశాఖ నగరంలోకి భారీ వాహనాలను అనుమతించరు. ఆ వాహనదారులు ఆనందపురం జంక్షన్ నుంచి డైవర్షన్ తీసుకుని పెందుర్తి, అనకాపల్లి మీదుగా మళ్లీ హైవేలోకి రావాలి.
- అనకాపల్లి నుంచి వచ్చే భారీ వాహనదారులు (పోర్ట్, నిత్యావసర వస్తువులను తీసుకెళ్లే వాహనాలు మినహా) లంకెలపాలెం, పరవాడ, దేశపాత్రునిపాలెం ప్రాంతాల నుంచి నగరంలోకి ప్రవేశించకూడదు. వారు నేరుగా సబ్బవరం-పెందుర్తి-ఆనందపురం హైవే మార్గంలోనే వెళ్లాలి.
- పెందుర్తి జంక్షన్ నుంచి సిటీలోకి వచ్చే భారీ వాహనాలు (పోర్ట్, నిత్యావసర వస్తువులను తీసుకెళ్లే వాహనాలు మినహా) నిషేధించారు.
- మద్దిలపాలెం ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ ఆర్చ్ నుంచి త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వైపు వీఐపీ వాహనాలు తప్ప ఏ ఇతర వాహనదారులకు గాని పాదచారులకు గాని అనుమతి లేదు.
- ఆ రోజు ఉదయం 2 నుంచి 11 వరకు యోగాలో పాల్గొనేందుకు వచ్చే వాహనదారులు తప్ప, ఇతర వాహనదారులకు బీచ్ వైపునకు ప్రవేశం లేదు.

50 ఏళ్ల చరిత్ర గల పాఠశాల మూసివేతకు యత్నం

తల్లిదండ్రుల ఆందోళన

- ఉపాధ్యాయులు లేరని గేటుకు తాళం
- విద్యాశాఖ అధికారులతో చర్చలు
- సమస్య పరిష్కారం కాకుండానే వెనుదిరిగిన అధికారులు



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న విద్యాశాఖాధికారులు, పోలీసులు

కంచరపాలెం: జీవీఎంసీ పరిధిలోని కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల క్యాంపస్‌లో ఉన్న జీవీఎంసీ కంచరపాలెం ప్రాథమిక పాఠశాలను టీచర్లు లేరనే సాకుతో మూసివేయడానికి ప్రయత్నించారు. దీంతో సోమవారం పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 50 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పాఠశాలను మూసివేయడాన్ని నిరసిస్తూ, తల్లిదండ్రులు కంచరపాలెం నేతాజీ కూడలి ఫ్లైఓవర్ వంతెన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గతంలో కంచరపాలెం పరిధిలో ఆర్పీపేట ప్రాథమిక, కంచరపాలెం ప్రాథమిక, రామ్మూర్తిపంతులుపేట, కే.కాలనీ ఉన్నత పాఠశాలలు ఉండేవి. పదేళ్ల క్రితం కే.కాలనీ ఉన్నత పాఠశాలను ఉపాధ్యాయుల లబ్ధి కోసం బర్మాక్యాంప్ కొండవాలు ప్రాంతానికి తరలించారు. అప్పటి నుంచి కే.కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాలలోనే చేరుతున్నారు.

ఉపాధ్యాయుల కొరతపై ఆందోళన

కంచరపాలెం ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది వరకు 11 మంది ఉపాధ్యాయులు ఉండగా, ప్రస్తుతం కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. మిగిలిన 9 మంది ఉపాధ్యాయులు కౌన్సెలింగ్‌లో బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 3, 4, 5 తరగతులకు చెందిన 225 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సోమవారం ఉదయం పాఠశాలను తెరవకుండా తాళాలు వేశారు. తమ పిల్లలను పాఠశాలకు తీసుకొచ్చిన తల్లిదండ్రులు తాళాలు వేసి ఉండటంతో ఆందోళన చెందారు.

పోలీసుల జోక్యం

పాఠశాల ఆవరణలో రికార్డు షీట్లు తీసుకుని సమీప పాఠశాలల్లో చేరాలంటూ ఏర్పాటు చేసిన బోర్డును చూసిన తల్లిదండ్రులు స్థానిక కార్పొరేటర్ రాజశేఖర్‌కు, విద్యాశాఖాధికారులకు ఫోన్లు చేశారు. వార్డు మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మకు, ఎస్ఎఫ్ఎస్ నాయకులకు సమాచారం అందించడంతో, ఈశ్వరమ్మ విద్యాశాఖాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి విద్యాశాఖాధికారులు రావాలంటూ నినాదాలు చేశారు. అధికారుల నుంచి స్పందన లేక పోవడంతో కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో రాస్తారోకో చేపట్టారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో సీఐ చంద్రశేఖర్ జోక్యం చేసుకుని, తల్లిదండ్రులకు నచ్చచెప్పి, విద్యాశాఖాధికారులతో మాట్లాడి పాఠశాల తెరిచేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన విరమించారు.

మొక్కుబడిగా సమావేశం

పాఠశాల మూసివేతపై ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సోమవారం సాయంత్రం ఎంఈవో-2 దివాకర్, సీఐచంద్రశేఖర్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ప్రేమ్‌కుమార్ , డిప్యూటీ డీఈవో సోమశేఖర్ కూడా పాల్గొన్నారు. సమస్య పరిష్కారంపై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండానే సమావేశం ముగిసింది.

అధికారుల నిర్లక్ష్యం



ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన పాఠశాలను మూసివేయడం తగదు. పాలకులు, విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీరు ఏమాత్రం బాగోలేదు.
-అప్పలరాజు, పేరెంటు, గొల్లకంచరపాలెం.

పాఠశాలను కొనసాగించాలి




జీవనోపాధికోసం పల్లె నుంచి పట్టణానికి వచ్చాం. కంచరపాలెం పరిధి పరిసర ప్రాంతాల్లో ఏళ్ల చరిత్ర కల్గిన పాఠశాల అని విని మా పిల్లలను ఇదే పాఠశాలలో చేర్పించాం. ఇపుడు మూసివేస్తామని చెప్పడం దారుణం. పాఠశాల మూసివేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం.
-టి.సావిత్రి దుర్గానగర్, కంచరపాలెం

విద్యార్థుల జీవితాలతో ఆటలు



విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యకు, పాఠశాలలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నేడు ఆ పరిస్థితి కనిపించడంలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాలను మూసివేయకుండా చర్యలు తీసుకోవాలి -ఎస్.పుష్పలత, తోటవీధి, కంచరపాలెం.

ఏ తల్లి కన్నబిడ్డో..!



తగరపువలస: సింహాచలం-విజయనగరం రోడ్డులోని అనంతవరం కూడలి బస్టాప్‌లో ఓ గుర్తు తెలియని మహిళ అప్పుడే పుట్టిన మగబిడ్డను వదిలేసి వెళ్లిపోయింది. ఆనందపురం మండలం శిర్లపాలెం గ్రామ పంచాయతీకి చెందిన బెవర సత్యవమ్మ ఈ బిడ్డను గ్రామంలోకి తీసుకువెళ్లి కోరాడ వరలక్ష్మి అనే మహిళకు ఇచ్చింది. దీంతో పంచాయతీలో కలకలం మొదలైంది. బిడ్డను పెంచుకోవడానికి పలువురు పోటీపడటంతో స్థానికులు ఆనందపురం పోలీసులకు, పద్మనాభం 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఎం.తిరుపతి, ఎస్.బంగార్రాజు శిశువుకు అత్యవసర చికిత్స అందించి, హుటాహుటిన కేజీహెచ్‌కి తరలించారు. ఆనందపురం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రైబల్ వెల్ఫేర్ చీఫ్ ఇంజినీర్‌గా శ్రీనివాస్

ఎంవీపీకాలనీ: జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఇంజినీర్‌గా ఎస్.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి ఎంఎం నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం శ్రీనివాస్ ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా సేవలు అందిస్తున్నారు. ఆయనకు తాత్కాలిక ప్రమోషన్‌లో భాగంగా చీఫ్ ఇంజినీర్‌గా నియమించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన ఈ పదవీలో కొనసాగనున్నారు.


కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

మహారాణిపేట: అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లలో భాగంగా ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను మంత్రులు పి.నారాయణ, కొలుసు పార్థసారధి, ఎం.రాంప్రసాద్‌రెడ్డి సందర్శించారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలకు కేటాయించిన లక్ష్యం మేరకు ప్రజల తరలింపు, రవాణా, వారికి కల్పిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు.

జీవీఎంసీ డీపీవోకు పదోన్నతి

డాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్న బి. ప్రసాదరావుకు పదోన్నతి లభించింది. ఆయనను తాత్కాలిక ప్రాతిపదికన ప్రాజెక్టు ఆఫీసర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పొరపాటు జరిగింది.. సరిచేస్తాం



జీవీఎంసీ జోన్ -4 అధికారుల వివరణ ప్రకటన

అల్లిపురం: ఈ నెల 15వ తేదీన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కళ్లు మూసుకున్నారా? కావాలనే చేశారా? కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. శిలాఫలకాలు తయారు చేయడంలో తప్పిదం జరిగిందని వివరణ ఇచ్చారు. పొరపాటు జరిగిన శిలాఫలకాలను మళ్లీ తయారు చేసి ఆయా వార్డులలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.